# నేను మరబొమ్మని కాదు

- కాకాని కమల

మే నెలాఖరురోజులు. ఎండలు మండిపోతున్నాయి.

మద్రాసు ఐఐటిలో ఆఖరి సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది సబిత. తల్లిదండ్రీ, అన్నలు అందరూ రైల్వేస్టేషన్‌కు వచ్చారు.

సబితని చూసి ఎనిమిదినెలలు అవుతోంది. ఆఖరి సంవత్సరం అని, వర్కు ఎక్కువగా వుందని దసరా సెలవులకి రాలేదు సబిత. ల్యాబ్ వర్క్ ఎక్కువగా వుందని, అదంతా పూర్తి చేసుకోవాలని సెలవుల్లో కూడా హాస్టల్‌లోనే వుండిపోయింది. అందుకే ఇంట్లో అందరూ సబిత కోసం ముఖం వాచిపోయారు. సబిత కూడా తల్లిని చూసి ఆపేక్షగా కౌగలించుకుని కన్నీళ్ళు కార్చింది.

స్టేషన్ నుంచి అంతా మారుతీ వ్యాన్‌లో ఇంటికి వచ్చారు.

ఇంటికి సున్నాలువేసి రంగులు వేసారు. ఇల్లంతా కొత్తదానిలా కళకళలాడుతోంది.

"ఏంటమ్మా ఇంటికి రంగులు వేసారు? అన్నయ్య పెళ్లి కుదిరిందా?" అంది సబిత చల్లని నీళ్ళు తాగుతూ.

"నీ పెళ్లి చేయకుండా నా పెళ్లి ఎలా చేస్తారు?" అన్నాడు అక్కడే ఉన్న శాయి నవ్వుతూ.

"అదేంటి? నీ పెళ్లి నీది నా పెళ్లి నాది కదా. నాతో వంతేమిటి?" అంది సబిత తల్లి ఇచ్చిన చల్లని నీళ్ళసీసా పక్కన పెడుతూ.

"పెళ్లికెదిగిన పిల్లవి. నిన్ను ఇంట్లో పెట్టుకుని మగపిల్లాడు పెళ్లికేం తొందరే సబితా. పెళ్లి నీదే. వచ్చేనెల పన్నెండున ముహూర్తం" అంది తల్లి కాత్యాయిని.

సబిత కేక పెట్టినంత పని చేసింది.

"ఏంటి నా పెళ్లా? జోకా?" అంది ముఖం చిట్లిస్తూ.

"జోకేంటే? ఇలాంటి విషయాల్లో జోకులేంటి? ఇంటికి సున్నాలు ఎందుకేయించాం? నీ పెళ్లి అనే. వచ్చేనెల 12న ఉదయం ఎనిమిదింటికి నీ పెళ్లి. శుభలేఖ కూడా రాయించాం" అంటూ అల్మారాలో పంచాంగంలోంచి పసుపు కాగితం తీసింది.

"అవునమ్మా సబితా. అమ్మ చెప్పింది నిజమే. నీ చదువు అయిపోయింది. ఇంక నీకు సంబంధం వెతుకుదాం అని మేం కూడా అనుకుంటున్నాం. ఇంతలో మంచి సంబంధం కాళ్ల దగ్గరకొచ్చింది. అందుకే ఖాయం చేసాం. లగ్నపత్రిక కూడా వేశాం. వచ్చేనెల 12న ఉదయం నీ పెళ్లి" అన్నాడు తండ్రి.

వెర్రిదానిలా అరిచింది సబిత.

"వ్వాట్. నా పెళ్లి నిశ్చయం అయిందా? మరి నాకెందుకు ఇంతవరకూ చెప్పలేదు."

"ఏది నువ్వు పరీక్షల హడావుడిలో వున్నావు. ఫోన్ చెయ్యలేదు. ఉత్తరం రాద్దాం అనుకున్నాం గానీ ఎలాగూ నువ్వు వస్తున్నావు కదాని ఊరుకున్నాం. మేం నీ పెళ్లి నిశ్చయించింది కూడా క్రిందటి వారమే. చూడని తీర్థం ఎదురు వచ్చినట్లు ఆ పెళ్లికొడుకు తల్లి, చెల్లెలు మనింటికి వచ్చారు. ఆ అబ్బాయి నీకు తెలుసు. రంగనాథ్ మనకి దూరపు బంధువు. సీతత్త కొడుకు. నీలాగే బిఇ పూర్తిచేసి ఇక్కడే ఏదో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు.

కానీ అతనికి సింగపూర్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. ఐదు సంవత్సరాల కాంట్రాక్టట. నిన్ను వాళ్ళ అబ్బాయికి చేసుకోవాలి అనుకుంటున్నాం అంది. ఆమధ్య ఏదో ఫంక్షన్‌లో నిన్ను వాళ్ళ అబ్బాయి రంగనాథ్ చూశాడట. ఎవరు అని వాకబు చేస్తే వాళ్ళు మన అడ్రస్ ఇచ్చారుట. సరే చుట్టరికం వుంది కదా, తెలుసున్నవాళ్ళు అని మీ సీతత్త మనిల్లు వెదుక్కుంటూ వచ్చింది. ఆ రంగనాథ్ నిన్ను మద్రాస్‌లోనే చూశాడట. అతనికి అక్కడ కంపెనీ పని వుండి వచ్చాడట. ఫ్రెండ్ మ్యారేజికి అటెండ్ చేశాడట. ఆ పెళ్లికి నువ్వు కూడా వచ్చావుట.

ఆ పెళ్లికూతురు నీ క్లాస్‌మేట్ అని చెప్పాడు. రంగనాథ్ కూడా బావుంటాడు. మంచి చదువు, ఉద్యోగం. మీ ఇద్దరికీ ఈడూజోడూ బావుంటుందని ఖాయం చేసాం" అంది తల్లి.

సబిత గొంతు తెగుతున్నట్లు అరిచింది.

తల్లి అందించిన లగ్నపత్రికని నేలకేసి కొట్టింది.


"మా ఇద్దరి ఈడూజోడూ బాగుందని మీరు కాదు చెప్పవలసింది నేను. నాకు అతను తగినవాడా కాదా, నచ్చాడా లేదా అని చెప్పాల్సింది నేను, మీరు కాదు. అయినా అతను ఇష్టపడితే అయిపోయిందా? నేను ఇష్టపడనక్కర్లేదా?" అంది.

"ఒప్పుకోకపోవడానికి అతనికి ఏం తక్కువని? సింగపూర్‌లో ఉద్యోగం."

గయ్యిమంది సబిత.

"అయిపోయిందా? పెళ్లికి ఇదేనా ముఖ్యం? నా ఇష్టం, నా మనసు, అభిప్రాయం... ఇవేవి అవసరం లేదా? అసలు నన్ను అడక్కుండా నా పెళ్లి మిమ్మల్ని ఎవరు నిర్ణయించమన్నారు?" అంది సబిత. ఆమె ముఖం జేవురించింది.

అంతకంటే హెచ్చుస్థాయి గొంతుతో కాత్యాయిని అంది "ఇప్పుడు నీకేదన్నా పనికిరాని వాడ్ని, గుడ్డి, కుంటివాడ్ని



అంటగడుతున్నామా? అన్నివిధాలా నీకు తగిన వాడ్ని చూశాం.''

"అదే నాకు తగినవాడని మీరెందులో, ఎలా నిర్ణయించారు అని అడుగుతున్నా.''

"ఎందుకేమిటి? నీ తల్లిదండ్రులం కనుక. ఏం ఆమాత్రం స్వతంత్రం మాకు లేదా? నిన్ను అడిగే కన్నామా? ఇంతదానిగా నిన్ను అడిగే పెంచామా? నీ అభివృద్ధిని నిన్ను అడిగే కోరుకున్నామా?''


"అమ్మా! అలాంటి పాయింట్లు తీయవద్దు. అది వేరే ఇది వేరే. నువ్వు నన్ను అడిగితే కనొద్దు అనేదాన్నేమో'' అంది.

"అయితే ఇంతకీ ఇప్పుడేమంటావ్?'' కాత్యాయిని కూతురికేసి కొరకొరా చూసింది.

"నాకీ పెళ్లి ఇష్టంలేదు. వెంటనే క్యాన్సిల్ చేయించండి'' నిక్కచ్చిగా చెప్పింది సబిత.

అంతవరకూ తండ్రి, అన్నలు ప్రేక్షకుల్లా నిలబడ్డారు. కానీ సబిత తండ్రి చివాలున కుర్చీలోంచి లేచి-

"ఏంటమ్మా సబితా! చదువుకున్నదానివి ఇలాగేనా మాట్లాడేది. నీ మంచి కోరే వాళ్ళం కనుక మంచి సంబంధం అని ఖాయం చేశాం. ఆ అబ్బాయికి సింగపూర్‌లో ఉద్యోగం వచ్చింది. వెంటనే జాయిన్ అవ్వాలట. మళ్లీ ఇప్పట్లో రావడం కుదరదట. దగ్గర్లో వున్న ముహూర్తం చూడండి అని వాళ్ళు అన్నారు. నీ హాస్టల్ ఫోన్ సరిగ్గాలేదని నువ్వే అన్నావు. అవసరం అయినప్పుడు నువ్వే చేస్తానన్నావు. అందుకని ఫోన్ చేయలేదు. పైగా నీకు పరీక్షల సమయం. ఉత్తరం రాద్దామంటే పరీక్షల్లో ఎందుకులే అనవసరపు టెన్షన్, ఎలాగు వస్తున్నావు కదా అని మేమే నిశ్చయం చేసాం.



తల్లిదండ్రులుగా ఆపాటి అధికారం పిల్లలపై ఉందనే అనుకుని వాళ్ళకి మాట ఇచ్చాం. ఇప్పుడు నువ్వు కాదంటే మా పరువు ఏం కావాలి? తాంబూలాలు పుచ్చుకున్నాం. లగ్నపత్రిక వేశాం. మంచి రోజు చూసి ప్రింటింగ్‌కు ఇవ్వాలి అనుకుంటున్నాం.

అటు వాళ్ళు ఇటు మేము కూడా చుట్టాలందరికీ చెప్పాం. నీ అభివృద్ధికోసం, చదువుకోసం బోల్డంత డబ్బు ఖర్చుపెట్టాం. అపురూపంగా చూసాం ఒక్క ఆడపిల్లవని. ఏం ఆమాత్రం నీమీద మాకు అధికారంలేదా?'' అన్నాడు. ఆయన గొంతులో ఆవేశం, ఆవేదన, అవమానం.

"అధికారం లేక కాదు నాన్నా. మిగతా ఏ విషయం అయినా ఫర్వాలేదు. కానీ నా పెళ్లి విషయంలో నా అభిప్రా,యం ఇష్టం, అవసరంలేదా?''

"ఇప్పుడు అతనికిమాత్రం ఏం తక్కువని? ఎత్తుగా, అందంగా ఉన్నాడు. మంచి ఉద్యోగం. నిన్ను ఇష్టపడి వాళ్ళకి వాళ్ళు వచ్చి అడిగారు.''

"కావచ్చు. అతను నన్ను ఇష్టపడి ఒప్పుకున్నాడు. వాళ్ళు అడగవలసింది మిమ్మల్ని కాదు నన్ను.

అంత చదువుకున్నవాడికి నా అభిప్రాయం తెలుసుకోవాలన్న కనీసం వివేకం లేదా? మగాడు ఇష్టపడడమే ఆడదాని భాగ్యం అనుకున్నాడా? కానీ ఈ పెళ్లి నాకిష్టంలేదు. అంతే'' పుల్ల విరిచినట్లు చెప్పింది సబిత.

"అయ్యో...అయ్యో'' అరచేత్తో నోరు నొక్కుకుంది కాత్యాయిని.

"పెళ్లి పత్రిక వేయించాం. నిశ్చయ తాంబూలాలు తీసుకున్నాం. పదిమందికీ చెప్పుకున్నాం. ఈ పరిస్థితిలో పెళ్లి క్యాన్సిల్ అయితే ఎంత అప్రతిష్ట? నాలుగుముక్కలు చదవగానే అంత కళ్ళు నెత్తికెక్కాయా? నిన్ను ఇంతదాన్ని చేసిన మేం అంత పనికిరాకుండా పోయామా?''

"అమ్మా! అలాంటి పాతకాలం మాటలు మాట్లాడకు. నాకు మైనారిటీ తీరింది. నా అభిప్రాయానికి విలువుంది.

నాకీ పెళ్లి ఇష్టంలేదు. నేను చేసుకోబోవడం లేదు. మీరు చెప్పలేకపోతే ఆ పెళ్లికొడుకుతో నేనే మాట్లాడతాను.''

"ఏం మాట్లాడతావ్?'' కాత్యాయిని నుదురు చిట్లించింది.

"నాకీ పెళ్లి ఇష్టంలేదని చెప్తాను.''

"ఎందుకని?''

"మా కాలేజీ అబ్బాయిని నేను ప్రేమించాను. మేం ఇద్దరం పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. అంతేకాదు, టెక్సాస్ యూనివర్శిటీలో ఎమ్ఎస్ చేయడానికి మా ఇద్దరికీ సీటు వచ్చింది. స్కాలర్‌షిప్ కూడా దొరికింది. అసిస్టెంట్‌షిప్ దొరికింది. ఎలాగూ వస్తున్నాను కదా అన్నీ చెప్పవచ్చు అనుకున్నాను. సరే ఇప్పుడు చెప్తున్నాను. జూన్‌లో మా ప్రయాణం. మద్రాస్‌లో వీసా తీసుకునే వస్తున్నాను. అందుకే ఆలస్యం అయింది'' అంది సబిత.

"సబితా! నువ్వు నీ పెళ్లి గురించే ఆలోచించావు. కానీ మన కుటుంబ పరువు...''

"నాకనవసరం. వాటికోసం నా జీవితాన్ని బలి పెట్టుకోలేను. నాకు నచ్చిన వ్యక్తితో నా పెళ్లి జరగాలిగాని మీకు నచ్చిన వ్యక్తిని నేను పెళ్లి చేసుకోవడం ఏమిటి?

ఐఐటిలో బిటెక్ చేసి అమెరికన్ యూనివర్శిటీలో సీటు సంపాదించుకున్న నన్ను వ్యక్తిత్వం లేని దానినని ఎలా అనుకున్నారు? పూర్వం హార్మోనియం పెట్టె ముందు పెట్టుకుని పెళ్లి చూపులకి కూర్చుని వాళ్ళు ఒప్పుకుంటేనే చాలు పెళ్లి కుదిరింది అని సంబరపడే ఆ పాతకాలం ఆడపిల్లని కాను. నేను నేటి మహిళని. ఆడపిల్ల అయినంత మాత్రాన మరబొమ్మ అనుకోవడం మీ తప్పు.

మగాడు ఇష్టపడితే చాలు ఆడపిల్ల గెంతులేస్తుంది అనుకోవడం ఆ సింగపూర్ పెళ్లికొడుకు తప్పు.

మీకు ఇష్టం అయితే నాకు నచ్చిన వ్యక్తితో నా పెళ్లి జరిపించండి. ఇష్టం లేకపోతే ఈ క్షణమే ఇంట్లోంచి వెళ్లిపొమ్మన్నా వెళ్లిపోతాను. అంతేగానీ నా నిర్ణయం మాత్రం మారదు'' చివాలున కుర్చీలోంచి లేచి విసురుగా తన గదిలోకి వెళ్లిపోయింది సబిత.

హాల్లో కుర్చీల్లో కూర్చున్న తల్లిదండ్రీ, అన్నలు శిలాప్రతిమల్లా అలాగే కూర్చుండిపోయారు.

కనీ పెంచిన తల్లిదండ్రుల్ని గౌరవించకపోవడం సబిత తప్పా?

మైనారిటీ తీరిన కూతురి వ్యక్తిత్వానికి విలువ ఇవ్వకపోవడం తల్లిదండ్రుల తప్పా?

ఇల్లు అలకగానే పండుగకాదు.

ఇంటి ముందు పందిరి వేసే మామిడి తోరణం కట్టగానే పెళ్లి అయిపోదు అని ఎవరన్నారోగానీ ఎంత కరెక్టుగా చెప్పారు!

★